GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 21 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 21-09-2024 | పేజీలు : 3

## సింగరేణి కార్మికులకు
# బోనస్ ప్రకటించిన రేవంత్

**టీ మీడియా, సెప్టెంబర్ 20,హైదరాబాద్**



సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి భారీ బోనస్ ప్రకటించారు.. ప్రతి కార్మికుడికి లక్షా 90 వేల రూపాయలు బోనస్ ఇస్తున్నామని, అంటే గతేడాది కంటే 20 వేలు అధికంగా అందిస్తున్నామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టితో కలసి నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, కార్మికులకు దసరా బోనస్‌ను ముందుగానే ప్రకటిస్తున్నామని వెల్లడించారు.తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పోరాట పటిమ అందరికీ స్ఫూర్తి అని, రాష్ట్ర సాధనలో వారిది కీలక పాత్ర అని కొనియాడారు. అలాంటి కార్మికుల గొప్పతనాన్ని తమ ప్రభుత్వం గౌరవిస్తుందని అన్నారు. ఈ ఏడాది ఇచ్చే బోనస్ కోసం ప్రభుత్వం రూ.796 కోట్లను వెచ్చిస్తోందని తెలిపారు. అంతేకాకుండా ఇకపై సింగరేణి లాభాల్లో కార్మికులకు కూడా వాటా ఇస్తామని, కనీసం 33 శాతం లాభాలు వారికి పంచుతామని వెల్లడించారు.

# హైడ్రాకు ఫుల్ పవర్స్ !



**-సన్న వడ్లకు రు 500 లు బోనస్**

**-ముగిసిన కేబినెట్ భేటీ**

**టి మీడియా,సెప్టెంబర్ 20,హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణ సచివాలయంలో ఈరోజు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. కాగా, ఈ కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడారు.

ముఖ్యంగా హైడ్రాకు మిగిలిన శాఖలకు ఉండే పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, ఈ మేరకు నిబంధనలను సడలించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఖరారుకు ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో 12 మందితో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇక కోఠి మహిళా, తెలుగు విశ్వవిద్యాలయం, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్స్ యూనివర్సిటీలకు పేర్ల మార్పునకు తెలంగాణ కేబినెట్ తాజాగా ఆమోదం తెలిపిందని వివరించారు.

**మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలివే..**

- హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ కేబినెట్ నిర్ణయం.
- 51 గ్రామ పంచాయతీలు హైడ్రా పరిధిలోకి వస్తాయని పేర్కొన్న కేబినెట్.
- ఆర్ఆర్ఆర్ ను ఖరారు చేసేందుకు 12 మందితో కమిటీని ఏర్పాటు.
- ఆర్ఆర్ఆర్ కమిటీ కన్వీనర్‌గా ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ.
- కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని మంత్రివర్గం నిర్ణయం.
- తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టాలని మంత్రివర్గం నిర్ణయం.
- హ్యాండ్లూమ్ టెక్నాలజీ, ఇనిస్టిట్యూట్ కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని మంత్రివర్గం నిర్ణయం.
- సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయం.
- మనోహరాబాద్ మండలంలో లాజిస్టిక్ హబ్ కు కేబినెట్ ఆమోదం.
- ఎస్ఎల్బీసీ టన్నెల్ రివైజ్డ్ ఎస్టిమేట్ పనులకు కేబినెట్ ఆమోదం.
- టన్నెల్ పనులకు రూ.4637 కోట్లు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం.

# ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తా

## మంత్రి నారా లోకేష్

**టీ మీడియా, సెప్టెంబర్ 20,చిత్తూరు:**



యువ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తానని రాష్ట్ర విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. యువగళం 100 కి.మీ. పూర్తయిన సందర్భంగా ఇచ్చిన తొలి హామీ మేరకు గ్రామప్రజల ఆనందోత్సాహాల నడుమ బంగారుపాళ్యంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ను మంత్రి లోకేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ%ౌ% రాబోయే 5ఏళ్లలో చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారుయువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లా ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని జీవితంలో మరువలేనని అన్నారు. గత ఏడాది జనవరి 27వతేదీన కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాల చెంతనుంచి నేను ప్రారంభించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన విషయం మీకందరికీ తెలుసు. 11ఉమ్మడి జిల్లాలు, 97 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 2200 గ్రామాలను స్పృశిస్తూ 3132 కి.మీ.ల మేర యువగళం పాదయాత్ర సాగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో మరెవరూ చేయనివిధంగా 14 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ 45రోజులపాటు 577 కి.మీ.ల మేర కొనసాగిన యువగళం పాదయాత్ర రికార్డు సృష్టించింది.యువగళాన్ని అడ్డుకునేందుకు ఆరోజున ఇదే బంగారుపాళ్యంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోని పోలీసులు ఎంత అరాచకం సృష్టించారో మీరంతా కళ్లారా చూశారు. నా పాదయాత్రను అడ్డుకునేందుకు జిఓ.1 విడుదలచేసి, ఇదే బంగారుపాళ్యంలో నా ప్రచారరథాన్ని నాటి పోలీసులు అడ్డుకుని నా గొంతునొక్కాలని విఫలప్రయత్నం చేశారు. కానీ, యువగళం అన్నది నా ఒక్కడి గొంతు కాదు. 5కోట్లమంది ప్రజల గొంతుక అని వారికి తర్వాత అర్థమైంది. ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువగళాన్ని ఆపడం వారి తరం కాలేదు. పాదయాత్ర సమయంలో ప్రతి 100 కి.మీ.లకు ఒక అభివృద్ధి కార్యక్రమానికి మైలురాయివేసి, అధికారంలోకి వచ్చాక నెరవేర్చాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాను.అందులో భాగంగా యువగళం పాదయాత్ర 8వరోజు (3-2-2023)న బంగారుపాళ్యంలో 100 కి.మీ.లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇక్కడ తొలి మైలురాయిని ఆవిష్కరించాను. ఈ ప్రాంతంలో డయాలసిస్ కేంద్రం అవసరం ఉందని స్థానికుల చెప్పిన మీదట ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తానని ఆనాడు హామీ ఇచ్చాను. పాదయాత్ర సమయంలో మీరు నాపై చూపిన అభిమానానికి రుణం తీర్చుకోవడానికి ఈరోజు చంద్రబాబు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వంలో మంత్రిగా మీ ముందుకువచ్చాను.బంగారుపాళ్యం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మీ అందరి ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోపే ఈరోజున బంగారుపాళ్యంలో డయాలసిస్ సెంటర్ ను ప్రారంభిస్తున్నాను. ఈ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో కిడ్నీబాధితులు వ్యయప్రయాసల కోర్చి దూరప్రాంతాలకు వెళ్లే బాధ తప్పుతుంది. తమ ఊళ్లోనే ఉచితంగా డయాలసిస్ చేయించుకునే అవకాశం దొరుకుతుంది. ఈరోజు రాష్ట్రప్రజలకు సేవ చేసుకునే అవకాశమిచ్చిన ప్రజలందరికీ మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

**గత స్మృతులను నెమరు వేసుకున్న లోకేష్**

యువగళం పాదయాత్ర బంగారు పాళ్యంలో 100 కి.మీ. చేరుకున్న సమయంలో తాను ఆవిష్కరించిన శిలాఫలకం దగ్గర లోకేష్ సెల్ఫీ దిగారు. అభిమానులు తనను ఆపిన బంగారుపాళ్యం సర్కిల్లో ఆగి స్థానికులతో మాట్లాడి పాదయాత్రలో జరిగిన ఘటనలు గుర్తు చేసుకున్నారు. ఆ రోజున పోలీసులు మైకు లాగేయడంతో అప్పుడు తాను మాట్లాడిన భవనం ముందు సెల్ఫీ దిగారు.

**ప్రజారోగ్యానికి పెద్దపీట: లోకేష్**

రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. బంగారుపాళ్యం కొత్తగా నిర్మించిన 30 పడకల ఆసుపత్రిని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో రెడ్ క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. తర్వాత ఆసుపత్రి ఆవరణలో మంత్రి లోకేష్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ,పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు పాల్గొన్నారు

# రెండేళ్లలో శ్రీశైలం సొరంగ పనులు పూర్తి చేస్తాం

## ఉప ముఖ్యమంత్రి భట్టి



**టీ మీడియా, సెప్టెంబర్ 20,నల్లగొండ :**

2027, సెప్టెంబర్ 20 వరకు శ్రీశైలం సొరంగం పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. శుక్రవారం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి లు ఎస్ ఎల్ బి సి టన్నెల్ పనులను పరిశీలించారు. టన్నెల్ అవుట్ లెట్ ప్రాంతానికి చేరుకున్న ఆయన ప్రత్యేక ట్రైన్ లో సొరంగం లోపలికి వెళ్లి పనులను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు సమీపంలోనే ఇరిగేషన్, అటవీ, విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కొద్దిపాటి ఖర్చుతో సంవత్సరం అంతా రూపాయి ఖర్చు లేకుండా సాగునీరు అందించే ఎస్ఎల్బీ సీ టన్నెల్ పనులను పూర్తి చేయడంలో బీ ఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.రాష్ట్ర విభజన కంటే ముందే ఎస్ ఎల్ బి సిసొరంగం 31 కిలోమీటర్లు పూర్తి అయిందని మిగిలిన 12 కిలోమీటర్ల సొరంగాన్ని తవ్వి నాలుగు లక్షల ఎకరాలకు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించేందుకు అప్పటి ప్రభుత్వం కేవలం 1000 నుండి 1500 కోట్లు మంజూరు చేస్తే ఈ ప్రాజెక్టు పూర్తయిదని అన్నారు. ప్రజలకు ఎంతో ఉపయోగమైన ఈ ప్రాజెక్టును కేసీఆర్ పూర్తి చేయకుండా మేడిగడ్డ ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలను దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను కేసీఆర్ పూర్తి చేస్తే తెలంగాణలో ఇప్పటికే లక్షల ఎకరాల భూమి సాగులోకి వచ్చేదని భట్టి విక్రమార్క అన్నారు.పురోగతిలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయక, అవసరం లేని ప్రాజెక్టులను నిర్మించి రాష్ట్రంలో బీ ఆర్ఎస్ ప్రభుత్వం 7 లక్షల కోట్ల రూపాయల అప్పుల భారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పై మోపిందని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఎస్ఎల్బిసి టన్నెల్ పనులను సందర్శించిన తాను ఇందిరమ్మ రాజ్యం వచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన సొరంగం పనులను పూర్తి చేసి బీడు భూములకు సాగునీరు అందిస్తానని చెప్పానని హామీ ఇచ్చిన విధంగానే ఈరోజు ప్రాజెక్టు పనులపై సమీక్ష చేశారని చెప్పారు.సొరంగాన్ని తొలిచే టీబీఎం మిషన్ బేరింగ్ చెడిపోవడంతో పనులు నిలిచిపోయాయని అధికారంలోకి వచ్చిన వెంటనే బేరింగ్ కోసం కోమటిరెడ్డి వెంకటరెడ్డిని అమెరికాకు పంపించామని చెప్పారు. బేరింగ్ కోసం 42 కోట్ల రూపాయలను మంజూరు చేశామని అతి కొద్ది రోజుల్లో బేరింగ్ రానుందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. టన్నెల్ పనులతో పాటు డిండి రిజర్వాయర్, నక్కల గండి, ఉదయ సముద్రం, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులను కూడా సాధ్యమైనంత త్వరలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఆయా ప్రాజెక్టుల కింద భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ భూముల సేకరణ తదితర అంశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సముద్ర ప్రభుత్వం చూస్తుందని చెప్పారు.రాష్ట్రంలోని ప్రాజెక్టులు పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, ప్రాజెక్టులు పూర్తి కోసం ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. సొరంగం రెండు వైపులా తొలిచే పనులు ప్రారంభమైతే రోజుకు 400 మీటర్ల సొరంగం తొవ్వే పనులు అవుతాయని ఇందుకోసం నెలకు 30 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని కాంటాక్ట్ పనులను దక్కించుకున్న సంస్థ చెప్పిందని ఆయన తెలిపారు. వారు చెప్పిన విధంగానే నెలకు 30 కోట్ల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నల్లగొండ ,నాగర్ కర్నూల్ జిల్లాల కలెక్టర్లు సి నారాయణరెడ్డి, సంతోష్, నీటిపారుదల సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాధ్యం కానీ ధరలకు నెయ్యి కాంట్రాక్ట్

## కాంట్రాక్టర్‌పై న్యాయపరమైన చర్యలు

**టి మీడియా, సెప్టెంబర్ 20,తిరుపతి బ్యూరో :**

దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోన్న తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూ కల్తీ వ్యవహారంపై తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు స్పందించారు. శ్రీవారి లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలోనే ల్యాబ్ టెస్టులు నిర్వహించామని తెలిపారు. నాసిరకం నెయ్యి కారణంగానే లడ్డూ ప్రసాదం నాణ్యత లోపించిందని ఈవో స్పష్టం చేశారు.తిరుమల ప్రసాదంలో వాడుతోంది నెయ్యా, నూనె అనే అనుమానాలు రావడంతో సరఫరాదారులకు వార్నింగ్ ఇచ్చామన్నారు టీటీడీ ఈవో శ్యామల రావు. కల్తీ పరిశీలనకు 75లక్షలతో ఏర్పాటు చేయగల ల్యాబ్ కూడా ఏర్పాటు చేయలేదని, గతంలో సరైన పరీక్షలు చేయకపోవడంతో సరఫరాదారులు కల్తీ చేసే అవకాశమిచ్చారని శ్యామల రావు స్పష్టం చేశారు. అలాగే, గతంలో సాధ్యంకానీ ధరలకు ప్రసాదం నెయ్యి కాంట్రాక్ట్ ఇచ్చారని, 220 నుంచి 410 రూపాయలకు ఎలా కాంట్రాక్ట్ ఇచ్చారో అర్థం కాలేదని టీటీడీ ఈవో శ్యామల రావు అన్నారు. తక్కువధరకు కొనడం వల్ల నాణ్యతపై కంట్రోల్ ఉండదని ఇంత తక్కువ ధరకు నెయ్యి సరఫరా చేయడం సాధ్యం కాదని ఆయన అన్నారు. ఎ ఆర్ డెయిరీ కంపెనీ సరఫరా చేసిన నాలుగు ట్యాంకర్ల నెయ్యి క్వాలిటీ లేదని గుర్తించి ఫస్ట్‌టైమ్ టీటీడీ బయట ల్యాబ్‌కు శాంపిల్స్ పంపామని టీటీడీ ఈవో శ్యామల రావు క్లారిటీ ఇచ్చారు. 320 రూపాయలకు కల్తీ నెయ్యి మాత్రమే వస్తుందని అర్థమయిందని, గుజరాత్‌లోని కాఫ్ ల్యాబ్‌కు శాంపిల్స్ పంపించామని ఆయన అన్నారు. శాంపిల్స్ పరీక్షల్లో 90శాతానికి పైగా క్వాలిటీ ఉండాల్సిన నెయ్యి 20శాతం కూడా క్వాలిటీ లేదని తేలిందన్నారు టీటీడీ ఈవో. సోయా, సన్‌ఫ్లవర్ సహా అనేక ఆయిల్స్ మిక్స్ అయ్యాయని, పిగ్ స్కిన్ ఫ్యాట్, అనిమల్ ఫ్యాట్స్ కూడా నెయ్యిలో ఉన్నట్టలు తేలిందన్నారు. దీంతో సరఫరాదారుడిని వెంటనే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామని, న్యాయపరమైన చర్యలు కూడా తీసుకుంటున్నామని శ్యామల రావు స్పష్టం చేశారు.తిరుమల శ్రీవారికి పెట్టే నైవేద్యంలో మే నుంచి మార్పులు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. గతంలో ఆర్గానిక్ ఆవు నెయ్యి, బియ్యం, బెల్లం ఓ సంస్థ నుంచి తీసుకున్నారని వాటి వల్ల ప్రసాదం నాణ్యత తగ్గిందని ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో నిపుణుల కమిటీ ద్వారా పరీక్షలు చేయిస్తున్నామని శ్యామలరావు అన్నారు. ప్రస్తుతం నైవేద్యానికి వాడుతున్న సేంద్రీయ పదార్థాలను కూడా తాత్కాలికంగా నిలిపివేశామని ఆయన అన్నారు. కల్తీ పరీక్ష కోసం బయటకు పంపడం టీటీడీ చరిత్రలో ఇదే తొలిసారి అని ఈవో శ్యామలరావు స్పష్టం చేశారు.



# తిరుమల లడ్డు...

## ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై టిటిడి ఉద్యోగుల ఆగ్రహం

**టి మీడియా, సెప్టెంబర్ 20,తిరుపతి బ్యూరో :**

శ్రీవారి లడ్డు పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై టిటిడి ఉద్యోగుల్లో, స్థానికుల్లో ఆందోళన

రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యాఖ్యానిస్తూ శ్రీవారి లడ్డులో కలుపుతున్న నెయ్యి నెయ్యే కాదు ఆవు కొవ్వు కలుపుతున్నారని చేయడం పట్ల ఉద్యోగులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

**సిఎం చంద్రబాబు నాయుడు ఏమన్నారంటే**

తిరుమల లడ్డు తయారీలో గత ప్రభుత్వం అపవిత్రం చేసిందని, నెయ్యికి బదులు జంతువుల కొవ్వును వాడారని అది నాకు తెలిసిందని, మేము శ్రీవారి లడ్డు తయారీకి స్వచ్ఛమైన నెయ్యి వాడుతున్నామని " వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన ప్రతిపక్ష వైసిపి ముఖ్యమంత్రి వద్ద ఆధారాలుంటే చర్యలు తీసుకోవాలే తప్ప, ఆధారం లేకుండా భక్తులు అమితంగా ప్రేమించే లడ్డు ప్రసాదం పై ఆరోపించడం సరికాదని ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై సిపిఎం, సిపిఐ కూడా అదే రీతిలో స్పందించాయి. శ్రీవారి ప్రసాదం పట్ల ముఖ్యమంత్రి మాట్లాడడం సరైనది కాదని, టిటిడి ఉద్యోగులను అవమానించడమే అని హెచ్చరించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీవారి ప్రసాదం పై

**ప్రమాణాలకు లోబడి ఉంటేనే నెయ్యి వినియోగం : టిటిడి ఉద్యోగులు**

తిరుమల కొండపై లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును వినియోగిస్తున్నారని స్వయంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారని కానీ టీటీడీలో పారదర్శకమైన విధానాలు అనుసరించబడుతున్నాయని చెప్పారు. ఏ ప్రసాదం తయారీకైనా దానికి వినియోగించే ఆహార పదార్థాలను తనిఖీ చేయడానికి టీటీడీ పరిధిలో ల్యాబ్ ఉందన్నారు. ఈ ల్యాబ్ లో తనిఖీలు చేసిన తర్వాతనే వినియోగిస్తారని చెప్పారు. సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిఎఫ్ టి ఆర్ ఐ, మైసూరు) పరిధిలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తారని, ఇది కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నడపబడుతుందని తెలిపారు. విశ్రాంత శాస్త్రవేత్త, మరో 12 మంది నిపుణులైన ఉద్యోగుల పర్యవేక్షణలో ఈ తనిఖీ జరుగుతుందన్నారు. ఈ తనిఖీ పర్యవేక్షణకు టీటీడీ నుంచి రోజుకొక బఅందం చొప్పున ప్రతిరోజూ సర్టిపై చేసిన తర్వాతనే ప్రసాదాలకు వినియోగించే ఆహార పదార్థాలను స్వీకరిస్తారని వివరించారు.

టిటిడి ఉద్యోగులు తెలిపారు. వాస్తవం ఇది కాగా ముఖ్యమంత్రి స్థాయిలోని వ్యక్తి తేలికగా ఇలాంటి ఆరోపణలు చేయటం సమంజసం కాదని భక్తుల మనోభావాలను, టీటీడీ ఉద్యోగులను అవమానపరిచినట్టే అవుతుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిధుల వినియోగానికి సంబంధించి అక్రమ వ్యవహారాలకు సంబంధించి తప్పులుంటే బాధ్యులను కఠినంగా శిక్షించడానికి ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. ప్రత్యర్థులను దెబ్బతీయాలనే పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపిక చేసుకున్న మార్గం సరైంది కాదని టిటిడి ఉద్యోగులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.



# ఏపీ సీఎంకు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

- బాధ్యులపై కఠిన చర్యలకు డిమాండ్

**టి మీడియా, సెప్టెంబర్ 20,హైదరాబాద్ బ్యూరో:**



శ్రీవారి భక్త కోటిని, యావత్ ప్రపంచంలోని హిందువుల మనోభావాలను తీవ్రంగా కలిచి వేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శ్రీవారి పవిత్రతను దెబ్బతీశారని, అన్యమత ప్రచారం జరుగుతోందని గతంలో ఫిర్యాదులు వచ్చినా గతపాలకులుపట్టించుకోలేదని మండిపడ్డారు. ఎర్రచందనం కొల్లగొడుతూ ఏడు కొండలవాడిని రెండు కొండలకే పరిమితం చేశారని చెప్పినాస్పందించలేదన్నారు.జంతువుల కొవ్వును లడ్డూ ప్రసాదంలో వినియోగించారని చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానన్న బండి సంజయ్, లడ్డూ ప్రసాదంలో కల్తీ నిజమేనని యావత్ హిందూ సమాజం భావిస్తోందన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు వినియోగించడం నీచం అన్నారు. గత పాలకులు టీటీడీని పట్టించుకోలేదు. అన్యమతస్తులకు టిటిడి పగ్గాలు ఇవ్వడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నతస్థాయి వ్యక్తుల ప్రమేయం లేనిదే ఇలాంటివి జరగవని, హిందూ ధర్మంపై దాడికి భారీ కుట్ర జరిగినట్లుగానే భావిస్తున్నామన్నారు.లడ్డూ ప్రాముఖ్యతను తగ్గించడానికి, టీటీడీపై కోట్లాది మంది భక్తులకు ఉన్న విశ్వాసాన్ని సడలించేందుకు ఈ కుట్ర చేశారని మండిపడ్డారు. క్షమించరాని నేరానికి ఒడిగట్టారన్నారు. అన్యమతస్తులకు టీటీడీ పగ్గాలు అప్పగించడం, అన్యమతస్తులకు ఉద్యోగాల్లో అవకాశం కల్పించడంవల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. సీబీఐతో విచారణ జరిపిస్తేనే సమగ్ర దర్యాప్తు జరిగి వాస్తవాలు నిగ్గు తేలే అవకాశముందన్న బండి సంజయ్, ఈ విషయంలో అంతిమ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. రాజకీయ ప్రయోజనాలను పూర్తిగా పక్కనపెట్టి హిందువుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.దేవుడిపై నమ్మకం లేని నాస్తికులకు, అన్యమతస్తులకు టీటీడీ పగ్గాలు అప్పగించడంవల్లే తిరుమల కొండపై అన్యమత ప్రచారానికి ఆస్కారం ఏర్పడుతోందని బండి సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. తిరుమల కొండ పవిత్రతపై, లడ్డూ ప్రసాదాలపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని బండి సంజయ్ కోరారు.

# ఐడియా అదుర్స్ కదూ...

- పంట పొలాల రక్షణకు నిఘా నేత్రాలు

**టి మీడియా, సెప్టెంబర్ 20,సిద్దిపేట :**

వ్యవసాయ బావులు, పొలాల వద్ద బోరు మోటార్లను, వైర్ల దొంగతనాలు పెరుగుతున్నాయి. ఇలా ఎత్తుకెళ్లి రైతులను ఇబ్బందులకు గురుచేస్తున్న దొంగల బెడద నుండి బయట పడేందుకు వినూత్న ఆలోచన చేశారు సిద్దిపేట జిల్లాకు చెందిన రైతులు.

ఐడియా అదుర్స్ కదూ.. పంట పొలాల రక్షణకు నిఘా నేత్రాలు పెట్టిన అన్నదాతలువ్యవసాయ బావులు, పొలాల వద్ద బోరు మోటార్లను, వైర్ల దొంగతనాలు పెరుగుతున్నాయి. ఇలా ఎత్తుకెళ్లి రైతులను ఇబ్బందులకు గురుచేస్తున్న దొంగల బెడద నుండి బయట పడేందుకువినూత్న ఆలోచన చేశారు సిద్దిపేట జిల్లాకు చెందిన రైతులు. రైతులందరూ కలిసి డబ్బులు పోగుచేసి, దొంగలను పట్టుకునేందుకు సోలార్ సిస్టంతో మూడో కన్ను వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్నరు. అవి నిరంతరం కాపలా కాసేలాగా ఏర్పాట్లు చేసుకున్న రు.దుబ్బాక మండలం ఆకారం గ్రామానికి చెందిన రైతులు ఊరు ప్రక్కనే ఉండే కూడవెల్లి వాగుకు అనుకుని ఉన్న పరిసర ప్రాంతాల రైతులు వాగులో మోటర్ వేసుకుని పంట పొలాలను సాగుచేస్తారు. కాగా, ఈ మధ్య కాలంలో రాత్రిపూట దొంగలు మోటార్లను, కేబుల్‌లను దొంగతనంగా ఎత్తుకెళుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో రైతన్నలు ఏకమై తలో పైసా వేసుకుని సోలార్ సిస్టంతో పొలాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా



నేత్రాలను ఏర్పాటు చేశారు.ఇది చూసిన సరిహద్దు ప్రాంతమైన కామారెడ్డి జిల్లా బిబిపేట మండలం తుజాల్ పూర్ గ్రామ రైతులు సైతం దొంగల కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. కూడవెల్లి వాగు పరిసర ప్రాంతాల్లోనే మా వ్యవసాయ పొలాలు ఉంటాయని అన్నారు. రాత్రివేళల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పొలాల వద్దకు వచ్చి కేబుల్ వైర్లు, మోటార్లను ఎత్తుకెళ్లారని అన్నారు. దీంతో ఎలాగైనా దొంగలను పట్టుకోవాలనే సంకల్పంతో ఈ ప్రాంత రైతులు అందరు కలిసి సుమారు 45 వేల రూపాయలతో సోలార్ సిస్టంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని అన్నారు.ఈ సీసీ కెమెరాల ప్రాంతంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే ఆ సీసీ కెమెరాలు సైరెన్ లాంటి శబ్దాలతో ఎవరో ఉన్నారని గుర్తుపట్టే విధంగా ప్లాన్ చేశామని రైతులు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నాటి నుండి మా ప్రాంతంలో ఎలాంటి సమస్యలు లేవని అన్నారు. మూడో కన్ను ముచ్చటగా పనిచేస్తుందని అన్నారు. ఇలానే అందరూ రైతులు వారి వారి పొలాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు తగ్గే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు రైతన్నలు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**టీ మీడియా, సెప్టెంబర్ 20, మహానంది:**



పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ ఓ ఆర్ డి శివ నాగజ్యోతి అన్నారు. శుక్రవారం మహానంది మండలం మసీదుపురం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ నాయకుడు నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల యందు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు భోజనం తినే ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూ చించారు.పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మనోహర్, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లుగా ఈ మహాపాపం జరుగుతూనే ఉంది

- ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న రమణదీక్షితులు

**టి మీడియా, సెప్టెంబర్ 20,తిరుమల:**



తిరుపతి క్షేత్రంసాక్షాత్తు ఇల వైకుంఠం అని నమ్మకం. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడు కొలువైన క్షేత్రం. ప్రతి ఒక్క హిందువు తమ జీవితంలో ఒక్కసారైనా ఏడుకొండల వాడిని దర్శించుకోవాలని.. ఏడు కొండలు ఎక్కి మరీ చేరుకునే పుణ్యధామం. తిరుమల శ్రీవారిని సామాన్య భక్తులే కాదు.. నాటి రాజుల నుంచి నేటి పాలకులు వరకూ దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటారు. వేంకటాచలపతికి ఎంత పేరుందో.. అంతే పేరు తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదానికి ఉంది. అయితే ఇప్పుడు స్వామివారి లడ్డు ప్రసాదంపై వివాదం నెలకొంది. లడ్డు తయారీ నాణ్యత రాజకీయ రంగుని పులుముకుంది. ఈ విషయంపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధానార్చకులుగా గతంలో పనిచేసిన రమణదీక్షితులు స్పందించారు. ప్రసాదంపై వార్తలు బాధాకరం అంటూ కల్తీ నెయ్యి విషయంపై కన్నీరు పెట్టారు.శ్రీవారి దేవాలయంలో ఇలా జరగడం అశేషమైన భక్తులతో పాటు అర్చకుడిగా, భక్తుడిగా తనకు ఎంతో మనోవేదన కల్గించిందని అన్నారు. ప్రధాన అర్చకుడిగా, ఆగమ సలహాదారుగా.. స్వామివారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడడం తన బాధ్యతని చెప్పారు. ప్రసాదం ముందులాగ లేదని ఎన్నో ఆరోపణలు వచ్చాయని చెప్పారు. ప్రసాదం విషయంలో భక్తుల ఆరోపణలపై తాను ఎన్నోసార్లు టీటీడీకి ఫిర్యాదు చేశానని ఎవరూ పట్టించుకోలేదని.. తనతో కలిసి ఈ విషయంపై పోరాడడానికి ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఈ ఐదేళ్లు నిరాటంకంగా మహాపాపం జరిగిందని.. లడ్డుప్రసాదం పై పలుమార్లు ల్యాబ్ రిపోర్టులు చూశానని .. లడ్డులో జంతు కొవ్వు ఉన్నట్లు తెలిసి తనను ఎంతో వేదనకు గురి చేసిందన్నారు శ్రీవారి ఆలయ గౌరవ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు

## దూర విద్యలో అడ్మిషన్లకు గడువు సెప్టెంబర్ 30

**టీ మీడియా,సెప్టెంబర్ 20, గోదావరిఖని ప్రతినిధి:**



కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో డిగ్రీ, పీజీ చేయడానికి సెప్టెంబర్ 30వ తేదీ వరకు గడువు ఉందని కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చేరడానికి ఇంటర్మీడియట్ పాస్ అయిన వారు అర్హులని, పీజీ కోర్సులు చేయడానికి డిగ్రీ పాసైన వారికి కోర్సులు చేయడానికి అవకాశం ఉందని తెలిపారు. దూర ప్రాంతాల వారు కూడా ఆన్లైన్లో అప్లై చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని డైరెక్టర్, ప్రొఫెసర్ సూచించారు. ఇతర వివరాలకు 8341385000 నంబర్ లో సంప్రదించాలని ఆయన కోరారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

- టిడిపి నాయకులు నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి

**టీ మీడియా, సెప్టెంబర్ 20, మహానంది:**



మహానంది మండలం మసీదుపురం గ్రామంలో టీడీపీ కార్యకర్త కావేటి ఉశెనయ్య తల్లి గుండెపోటుతో మరణించారు. శుక్రవారం టీడీపీ నాయకుడు నరాల చంద్ర మౌళీశ్వర్ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపి, దహన సంస్కారాలకు రూ.10000 రూపాయలు అర్థిక సహాయంగా అందజేశారు.ఆయన మాట్లాడుతూ.. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

## సాయిచంద్ జయంతి సందర్భంగా నివాళులు

**టీ మీడియా ,సెప్టెంబర్ 20, వనపర్తి బ్యూరో :**



తెలంగాణ ఉద్యమానికి తన ఆటపాటలతో ఊపిరిపోసిన సాయి చంద్ ధన్యజీవి. సాయిచంద్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన బిఆర్ఎస్ నాయకులు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి గాయకుడు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ కీర్తిశేషులు సాయిచందు జయంతి సందర్భంగా పట్టణ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యములో ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ మాట్లాడుతూ సాయిచంద్ దళితబిడ్డగా పుట్టి తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు.సాయిచందు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఉపన్యాసాలు విని ప్రభావితమై తెలంగాణ రాష్ట్ర సాధనకు తన ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసి రాష్ట్రాన్ని సాదించినారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి.శ్రీధర్, మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్,ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి,కౌన్సిలర్స్ బండారు.కృష్ణ, నాగన్న యాదవ్, కంచె.రవి కో ఆప్షన్ సభ్యులు గులాం ఖాదర్ ఖాన్,మైనార్టీ సెల్ అధ్యక్షులు జోహేబ్ హుస్సేన్,డ్యానియాల్,నీల స్వామి, ఉగ్గ్లమ్. తిరుమల్ ,పాషా, ఆరీఫ్,రాంచందర్, వజ్రాల.రమేష్, తోట.శ్రీను తదితరులు పాల్గొన్నారు .

## పాఠశాల నిర్వహణ గ్రాంట్ వెంటనే విడుదల చేయాలి

**టీ మీడియా, సెప్టెంబర్ 20, మహానంది:**



పాఠశాల నిర్వహణ గ్రాంట్ ను వెంటనే విడుదల చేయాలని నంద్యాల జిల్లా పిఆర్టియు జిల్లా అధ్యక్షులు రామ పక్కిరెడ్డి కోరారు. శుక్రవారం మహానంది మండలంలో వివిధ పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులకు పి ఆర్ టి యు సభ్యత్వ నమోదును చేయించారు. వారు మాట్లాడుతూ..గత రెండు సంవత్సరాలుగా పాఠశాల నిర్వహణ గ్రాంట్ విడుదల చేయకపోవడం వలన, పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.అనవసరమైన యాప్లను తొలగించి ఉపాధ్యాయుల బోధనకు సహకరించాలని కోరారు. కేజీబీవీ పాఠశాలలకు కూడా అన్ని పాఠశాల లాగానే సమయ వేళలు ఉండాలని, కేజీబీవీ పాఠశాలలకు వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులకు జీతాలు ఆలస్యం కాకుండా చెల్లించాలి, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐ ఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. రావలసిన బకాయిలు చెల్లించాలని, మోడల్స్ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దేవనాల శ్రీనివాసులు, మండల పిఆర్టియు నాయకులు తులసీశ్వర్ రెడ్డి, మౌలి రెడ్డి, మద్దిలేటి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ శుభ్రం చేసిన మున్సిపల్ సిబ్బంది

**టీ మీడియా, సెప్టెంబర్ 20, గోదావరిఖని ప్రతినిధి:**




స్వచ్ఛతా హీ సేవా -2024 కార్యక్రమంలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కూరగాయల మార్కెట్లో వర్తకులతో కలసి చీపురు పట్టి నగర పాలక సంస్థ పర్యవేక్షక సిబ్బంది కూడా శుభ్రం చేశారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఎన్ సి సి , ఎన్ ఎస్ ఎస్ వలంటీర్లతో కలిసి ఆవరణ పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర పాలక సంస్థ సెక్రెటరీ రాజు , హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్ , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , కళాశాల ప్రిన్సిపల్ తో పాటు అధ్యాపకులు , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**టీ మీడియా, సెప్టెంబర్ 20, వనపర్తి బ్యూరో :**



వానాకాలం వరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.శుక్రవారం ఉదయం కలక్టర్ క్యాంపు కార్యాలయంలో వరి కొనుగోలు పై సమీక్ష నిర్వహించారు.ఈ సారి సన్న రకం వడ్లకు ప్రభుత్వం ద్వారా క్వింటాలుకు 500/- రూపాయలు అదనంగా ఇస్తున్నందున జిల్లాలో భారీగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో నవంబర్ మొదటి వారం నుండి కోతలు ప్రారంభమై ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామ పంచాయతీలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఐ.కే.పి, ప్యాక్స్, మేప్మా వారికి కొనుగోలు కేంద్రాలు కేటాయించాలని సూచించారు. నాణ్యమైన వడ్లు తీసుకోవడంతో పాటు దొడ్డు రకం, సన్న రకం వేరు వేరుగా చేసుకోగలిగే విధంగా కొనుగోలు కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి మండల రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో వడ్ల నుండి చెత్త, తాలు వేరు చేసేవిధంగా ఫ్యాన్ ఏర్పాటు చేసుకోవాలని అదేవిధంగా వరి రకం పరిశీలించేందుకు మైక్రో మీటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ శాఖ దగ్గర ఉన్న తూకం యంత్రాలను తూనికలు కొలతల శాఖ అధికారి ద్వారా తనిఖీ చేయించి ధృవీకరణ పత్రం తీసుకోవాలని సూచించారతేమ కొలిచే యంత్రాలను సైతం తనిఖీ చేయించి అవి సరిగ్గా పని చేస్తున్నాయా లేవా చూసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మేరకు గన్ని బ్యాగులు, తాడ్పలిన్ లు సమకూర్చుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం. సివిల్ సప్లై ఇర్ఫాన్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, తూనికలు కొలతల అధికారి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటికే

- పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము

**టీ మీడియా, సెప్టెంబర్ 20, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని వల్లభ నగర్ 33 వార్డులో వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏ సుమిత్రమ్మ, సర్పంచ్ దేవేందర్ నాయుడు, మహిళా మాజీ అధ్యక్షులు వారణాసి కల్పన, మహిళా జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కవిత, జ్ఞానేశ్వర్ శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. వనపర్తి బిజెపి పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సభ్యత్వ నమోదు తీసుకోవడం వలన ఎన్నో లాభాలు ఉంటాయి. 8800 002024 మిస్డ్ కాల్ ఇవ్వండి మెసేజ్ వస్తది మెసేజ్ లో లింక్ ఓపెన్ చేసి మీ బయోడేటా పెట్టండి కేవలం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సభ్యత్వ నమోదు చేయండి చేసిన వారికి కేంద్రం నుండి నేరుగా పథకాలు, ఇన్సూరెన్స్ లాంటివి కేంద్రంలో పడిన సంక్షేమ పథకాలు ఆన్లైన్లో వస్తుంటాయి. దానిలో మీరు చూసుకొని అప్లై చేసుకోవాల్సిందిగా బచ్చరాము కోరారు. నరేంద్ర మోడీ దేశ ప్రధాని అయిన తర్వాత నేరుగా ఇంటికి దగ్గరికి వారికి పథకాలు చేరవేయాలని ఈ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. దేశవ్యాప్తంగా 18 కులాల వరకు కులవృత్తుల వారికి పీఎం విశ్వకర్మ దాదాపు వనపర్తి లో 4 వేల కుటుంబాలు నమోదు చేసుకోవడం జరిగింది. ప్రస్తుతం కులాలవారీగా శిక్షణ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది. శిక్షణ ఇచ్చిన తర్వాత వారికి నేరుగా వారి అకౌంటుకు లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు కేంద్రం నుండి వచ్చే పథకాలు లింకు ద్వారా చూసుకొని పెట్టుకోగలరని కోరారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన

**టీ మీడియా, సెప్టెంబర్ 20 ,పెద్దదోర్నాల:**




పెద్ద దోర్నాల. దోర్నాల ఎంపీడీఓ కార్యాలయం నందు సమాచార హక్కు చట్టం -2005 పైన వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు, గ్రామ స్థాయి అధికారులకు మరియు రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ. సమాచార చట్టం ఉద్దేశం అధికార యంత్రాంగంలో పారదర్శక జవాబు దారి తనం తీసుకురావడం, అవినీతిని అరికట్టడం, ప్రభుత్వం కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడం, పరిమిత ద్రవ్యవనరులను సమర్థవంతంగా వినియోగించటం. సమాచార హక్కు చట్టం సామాన్యుడికి అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు.అలాగే ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ ఎం . నాసర్ రెడ్డి మాట్లాడుతూ .సమాచార హక్కు చట్టం లో దరఖాస్తు రుసుము ఎలా చెల్లించాలి, వచ్చి పోరుడికి సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం లాంటిదని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రజల కొరకు ఏర్పాటు చేయబడిన వ్యవస్థను జవాబుదారి తనముతో అవినీతి రహితంగా పనిచేయాలంటే ప్రజలు సక్రమంగా పోషించాలని అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం సక్రమంగా అమలవుతుందని ప్రజలందరికీ సమాచారం హక్కు చట్టంపై అవగాహన కల్పించి వారిని చేతన పరిచి సమాచార చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.సమాచార హక్కు చట్టం 2005 రైతులకు అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.చట్ట పరిధిలో సెక్షన్ ల గురించి వివరించడం జరిగింది.అలాగే ఈ కార్యక్రమం లో తహసీల్దార్ . కిన్నెర. శాంతి . మాట్లాడుతూ. ప్రతి ప్రభుత్వ కార్యాలయం లో సెక్షన్ 5(1)మేరకు పి /ఆపివు ఉంటారు. సమాచారం కొరకు సమాచారం తెలిపే బోర్డు ఏర్పాటు చేయాలనీ తెలిపారు.ఈ చట్టాన్ని రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును ఉపయోగించుకొని ఎలాంటి సమాచారాన్ని అయినా పొందవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో మండల స్థాయి అధికారులు అయినా ఎంఈఓ.మస్తాన్ నాయక్., , హౌసింగ్ ఏ. ఈ. శివశంకర్., గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యన సహకులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతిభను సమాజం గుర్తించేలా ఆడాలి

**టీ మీడియా, సెప్టెంబర్ 20, మహానంది:**





ప్రతిభను సమాజం గుర్తించేలా ఆడాలని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు విద్యార్థులకు మండల స్థాయి అండర్ 14, అండర్ 17 క్రీడ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ మురళీధర్, టిడిపి మండల అధ్యక్షుడు మధు, ఇన్చార్జి మండల విద్యాశాఖ అధికారి -2 నారాయణ,హాజరై కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, సెటిల్ బాడ్మింటన్, యోగ, చెస్సు, అథ్లాంటిక్స్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామసుబ్బయ్య మాట్లాడుతూ.. మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, ఆత్మకూరు లోని నియోజకవర్గ స్థాయిలో జరిగే, క్రీడా పోటీల్లో ఆడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నార

## సాదాసీదాగా మండలసమావేశం

**టీ మీడియా, సెప్టెంబర్ 20, పెద్ద దోర్నాల:**



మండల పరిషత్ కార్యాలయం లోఎంపిపి గుమ్మ పద్మజ.అధ్యక్షతన శుక్రవారం రోజున మండల సర్వసభ్య సమావేశం సాదా సీదాగా సాగింది.గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు,తదితర అంశాలపై ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది.పూర్తి స్థాయిలో ప్రజా ప్రతినిధులు రాక,వచ్చిన వారితోనే సమావేశాన్ని తూ తూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ప్రసున్నదేవి. ఆస్పత్రి సూపర్డెంట్. వి .నాగ మల్లేశ్వరి.ఆర్ ఐ. వెలుదండ్ల. నాగేశ్వరరావు. జూనియర్ అసిస్టెంట్ అంజి నాయక్ . అంగన్వాడి సూపర్వైజర్ అంజమ్మ.సిబ్బంది పంచాయతీ కార్యదర్శిలు . పాల్గొన్నారు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటీసీలు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధికి లక్ష రూపాయల విరాళం



**టీ మీడియా, సెప్టెంబర్ 20, పెద్ద దోర్నాల:**

విజయవాడ వరద బాధితుల సహాయార్థం దోర్నాల పట్టణంలోని బీఎం డిగ్రీ కళాశాల యాజమాన్యం వారు 1,00,000/- రూపాయలను సీఎం సహాయనిధి కింద యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కి అందించారు. ఈ సందర్భంగా వరద బాదితుల పక్షాన తమవంతు కృషి చేసినందుకు ఎరిక్షన్ బాబు బీఎం డిగ్రీ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బి. ఎం.డిగ్రీ కాలేజీ అధినేత బట్టు రమణారెడ్డి.తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏరువా.మల్లికార్జునరెడ్డి.బట్టు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి యం. గోవిందరాజు

**టీ మీడియా, సెప్టెంబర్ 20, వనపర్తి బ్యూటీ :**



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్యాల ను వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) యం.గోవిందరాజు విద్యాశాఖ పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం సందర్శించారు.ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థుల సంబంధిత అన్ని సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి ఆనందం వ్యక్తం చేశారు.10 జీపీఏ అందరూ సాధించాలని, మంచిగా చదవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలిపారు.మధ్యాహ్న భోజనం మంచిగా ఉందా లేదా అనివిద్యార్థులను అడిగి తెలుసుకోని, మధ్యాహ్న భోజన ఆహారాన్నిపరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సంజీవయ్య , ఉపాధ్యాయులు వరదాచారి రుద్రమదేవి, గిరిరాజాచారి, రవి ఉన్నారు.

